# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 68 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 30, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి గారి పార్థివదేహానికి నివాళులు అర్పించిన సీఎం.




# ప్రజలారా... మీ ఆయుధం మేమవుతాం

- మీ ఇండ్లపై బుల్డోజర్ దిగాలంటే... ముందు బీజేపీ కార్యకర్తలను తాకాలి
- మీ ఆస్తులకు మేం రక్షణగా ఉంటాం
- తెగించి కొట్లాడేందుకు బీజేపీ సిద్ధం
- పేదల ఇండ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?
- 6 గ్యారంటీలు అమలు చేయకుండా మోసం చేయడమే ఇందిరమ్మ పాలనా?
- మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లపై హైడ్రా దాడులు
- హామీల అమలు, మాజీ సర్పంచుల బిల్లుల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే
- హైడ్రా దాడులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- హైదరాబాద్ బర్కత్‌పురాలో ఎంపీ లక్ష్మణ్ తో సేవా పక్వాడ్ ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం): హైడ్రా దాడుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. హైడ్రా దాడులపై ప్రభుత్వం పున: సమీక్షించుకోకుంటే బీజేపీ తెగించి కొట్లాడేందుకు సిద్దంగా ఉందని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ "ప్రజాలరా.... మీకు అండగా బీజేపీ ఉంది. మీ ఆస్తులను రక్షించే బాధ్యత తీసుకుంటాం. మీ ఆయుధం మేమవుతాం. పేదలకు ఆయుధంగా బీజేపీ మారబోతోంది. మీ ఇండ్లపై హైడ్రా బుల్డోజర్లు దిగాలంటే... ముందు బీజేపీ కార్యకర్తలపైన, మాపైన బుల్డోజర్లపై దిగిన తరువాతే మీ ఇండ్లను తాకాలి. అందుకు పూర్తిగా సన్నద్ధమై ఉన్నం. ప్రభుత్వం కూడా పేదల ఇండ్ల కూల్చే ముందు దానికి సిద్ధం కండి. ఈ విషయంలో ఎందాకైనా తెగించి కొట్లాడేందుకు రడీగా ఉన్నం"అని స్పష్టం చేశారు.

హైదరాబాద్ బర్కత్‌పురాలోని బీజేపీ సిటీ సెంట్రల్ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా పక్వాడ ఫోటో ఎగ్జిబిషన్ ను రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ

# మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం..

**వారు బాగుంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది**

**'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్,సెప్టెంబర్29(నమస్తే ఉదయం): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో విజేతలను సీఎం రేవంత్ సత్కరించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సంఘీభావంగా నగరవాసులు పింక్ పవర్ రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళల కోసం మరిన్ని ఆస్పత్రులను నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని, భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు.

గచ్చిబౌలి స్టేడియం నుంచి 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో ఈ రన్ నిర్వహించారు. విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఔత్సాహికులు.. దాదాపు 12 వేల మంది ఈ పరుగులో పాల్గొన్నారు.

రన్‌లో భాగంగా గిన్నిసబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేందుకు పక్షి ఆకారంలో అతి పెద్ద మానవహారం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకే రైతు దీక్ష

- రైతన్నలకు నష్టం చేస్తే మంచిది కాదనే సోయి రేవంత్ రెడ్డికి లేదు
- ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం): సోమవారం ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు 24 గంటలపాటు ఇందిరాపార్క్ దగ్గర రైతు దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇందులో పెద్ద ఎత్తున రైతులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులందరూ పాల్గొంటారు. రైతులకిచ్చిన హామీలను నెరవేర్చేలా.. ప్రభుత్వం మెడలు వంచి ఒత్తిడి తీసుకురావటమే రైతు దీక్ష లక్ష్యం.

ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గే సమక్షంలో 6 గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చారు. అందులో రైతుల కోసం రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, వడ్లకు రూ.500బోనస్, కౌలు రైతులకు రైతుబంధు, రైతుకూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఇంకా ఒక అడుగు ముందుకు వేసి ఎవరైనా లోన్ లేని వాళ్ళు ఉంటే వెంటనే బ్యాంకుకు వెళ్లి రుణం తీసుకోండి.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రుణమాఫీ చేస్తానని చెప్పారు.ప్రస్తుతం రేవంత్ రెడ్డి పిల్లి గంతులు వేస్తూ దిక్కులు చూస్తున్నాడే తప్ప చప్పుడు చేయడం లేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో దేవుళ్ళ మీద ఒట్లు పెట్టి ప్రజల్లో నమ్మకం కలిగించే ప్రయత్నం చేశారు. నమ్మకం పోతుందన్న క్రమంలో అన్ని రకాల నిధులు ఆపి రైతు 0



## రేవంత్ రాజీనామా చేయక తప్పదు..

**లీగల్ నోటీసులిస్తే.. ఇల్లీగల్ దందాలపై మాట్లాడకుండా ఉంటానా?: కేటీఆర్**





హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం): "దేశంలో న్యాయవ్యవస్థ బలంగా, నిజాయితీగా ఉంది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్‌చవాన్‌లాగా, నువ్ అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికావు. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయక తప్పదు" అని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. "మీ బావమరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడకుండా ఉంటాననుకుంటున్నావా? బావమరిదికి అమృతాన్ని పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోబోం" అని పేర్కొన్నారు. సీఎంపరిధిలోని శాఖలోనే తన బావమరిదికి కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్ట బెట్టింది నిజమని తెలిపారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్7, 11, 13ను ముఖ్యమంత్రి ఉల్లంఘించారని. గత రెండేళ్లుగా రూ.2కోట్లు లాభం ఆర్జించిన ఒక చిన్న కంపెనీ అంతపెద్ద టెండరు కట్టబెట్టారని, ఈ అవినీతి నుంచి ఢిల్లీలో ఉన్న రేవంత్ బీజేపీ దోస్తులు కూడా ఆయనను కాపాడడం కష్టమేనన్నారు. నగరంలో నీ రూ.1.50 లక్షల కోట్ల మూసీ ధనదాహానికి బలవుతున్న జీవితాలు లక్షల్లో ఉన్నాయి మిస్టర్ చీఫ్ మినిస్టర్ అంటూ విమర్శించారు.

# అభివృద్ధి, స్వేచ్ఛకు ప్రభుత్వ ప్రాధాన్యత

- ఆస్తులు కాపాడడం ప్రభుత్వ బాధ్యత
- శాన్ ఫ్రాన్సిస్కోలో తెలుగు కమ్యూనిటీ మీట్ అండ్ గ్రీట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

శాన్‌ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం): అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గతంలో ఫ్యూడల్ మన స్తత్వంతో బందీ చేయబడిన రాష్ట్రాన్ని పూర్తి స్వేచ్ఛయుత రాష్ట్రంగా మార్చామని.. భవిష్యత్తులో ఈ విధానం కొనసాగుతుందని తెలిపారు. ఎవరు ఏ భావజాలానైనా వ్యక్తపరిచే వాతావరణాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పరిచామని వివరించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు అంతా తెలంగాణ రాష్ట్రం తో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఏమాత్రం అవకాశం ఉన్న ఉపయోగపడాలని..



తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టించాలని వారిని కోరారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్... ఇళ్ల నిర్మాణం పేరిట రాళ్లు కనుమరుగైపోయాయి. లేక్స్ కబ్జా చేసి ఇల్లు కట్టు కున్నారు. పార్కులు లేకుండా పోయాయి. లేక్స్ లేకపోతే వరదలు వచ్చినప్పుడు ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకు పోయిన పరిస్థితులు హైదరాబాదులోనూ ఏర్పడతాయి. నది గర్భంలో ఇల్ల నిర్మాణాలు చేస్తున్నారు. వీటిని ఇప్పటికీ ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది.

హైదరాబాద్‌కి ప్రాణాంతకంగా మారుతుంది. పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారు. ధన, మానప్రాణాలు కాపాడడం ప్రభుత్వం బాధ్యత. ఆస్తులు కాపాడడం ప్రభుత్వం బాధ్యత. అందులో భాగంగా చెరువులను రక్షించేందుకు భవిష్యత్తు తరాలను అందించేందుకు తెలంగాణ రాష్ట్రంలో చర్యలు చేపట్టాం. వందల చెరువులు కనపడకుండా పోయాయి. కనీసం చెరువు గర్భంలో కట్టుకోకుండా అయినా ఆపాలి అనేది మా ప్రభుత్వం ఆలోచన అన్నారు. మూసీ నదిలో మంచినీరు పారించడం పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన.

మూసి పునర్జీవం కార్యక్రమంలో భాగంగా నిర్వాసితులకు పూర్తి అవగాహన కల్పించి పునరావాస చర్యలు చేపడుతున్నాం. వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, వారి

# పేదల రక్తం మీద, కన్నీళ్ళ మీద మూసీ సుందరీకరణ చేస్తావా?

**- సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం): పేదవాళ్ల రక్తం మీద, కన్నీళ్ళ మీద మూసీ సుందరీ కరణ చేస్తావా? చేయడానికి రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి.. అయినా వాటిని వదిలేసి మూసి నది మీద పడి పేదల ఉసురు తీస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డి చర్యలపై మండిపడ్డారు. లంగర్ హౌస్ హసీంనగర్ లో మూసీ ప్రాజెక్ట్ బాధితులకు అండగా నిలిచేందుకు మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ బృందం వెళ్ళింది. ఈ సందర్భంగా బాధితులు తమ ఆవేదనను మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ బృందానికి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు ఏమన్నారంటే... రేవంత్ రెడ్డి ఈరోజు పేదల విషయంలో అనవసర ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇళ్లన్నీ కూలగొట్టి ప్రపంచ బ్యాంకుకు మన భూములను కుదువబెడతాడంట.

మూసీ నది సుందరీకరణ పేరుమీద రిసాట్లు గట్టి హోటల్ కట్టి ఏదో ఉద్దరిస్తాడంట. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టకుండా... ఎన్నికల్లో ఇవ్వని హామీ కోసం ఎందుకు కూల్చడం? ఇందులో ఇచ్చిన ఆరు గ్యారెంటీలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. మహిళలకు ఇచ్చేందుకు 2500 లేవు కానీ పేదల బతుకులను కూల్చేందుకు 1,50,000 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? కెసిఆర్ 200 పెన్షన్ 2000 చేసిండు. రేవంత్ రెడ్డి 2000 పెన్షన్ 4000 చేస్తా అన్నాడు కానీ ఇప్పటివరకు కేసీఆర్ ఇచ్చిన పెన్షన్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదు.

అసెంబ్లీలో పెన్షన్ ఎప్పుడు ఇస్తావు అని నిలదీస్తే పైసలు లేవని చేతులెత్తేశారు. మరి మూసీ ప్రాజెక్టు కోసం లక్షల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? మేనిఫెస్టోలో మూసీ గురించి చెప్పలేదు కదా.






ఆరు గ్యారెంటీల గురించి చెప్పావు కదా ఎందుకు మూసీ గురించి డ్రామాలు చేయడం? కేసీఆర్ ఎన్నికల్లో చెప్పకున్నా కల్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో లక్షతో పాటు ఒక తులం బంగారం కూడా ఇస్తా అన్నాడు. బంగారం లేదు లక్ష రూపాయలు లేవు. ఎవరికోసం మూసీ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నావు.? ఇందులో ఎవరెవరి హస్తముంది. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించారు. ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి కేసీఆర్. కేసీఆర్ నిర్మించే కార్యక్రమం చేశారు. రేవంత్ రెడ్డి కూలగొట్టే కార్యక్రమం పెట్టుకున్నారు. ఇతర రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ బుల్డోజర్ రాజ్యం నడవదు అని ప్రచారం చేస్తున్నాడు. కానీ, హైదరాబాద్ లో మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూండా రాజ్ రాజ్యం తెచ్చారు.

కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును తీసేసి బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలి. ఇది మీ అయ్య జాగిరి కాదు రేవంత్ రెడ్డి. ఇక్కడ 30 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఉండే ప్రజలు అన్ని రకాల టాక్సు కడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించుకున్న నిర్మాణాలే కదా. కేసు పెట్టేది ఉంటే ఏ ప్రభుత్వమైతే అనుమతులు ఇచ్చిందో వారి మీద కేసు పెట్టండి. మీరు ధైర్యంగా ఉండండి బుల్డోజర్ రావాల్సి వస్తే మమ్మల్ని దాటుకొని రావాలి. మీరు ఫోన్ చేస్తే అర్థగంటలో మీ ముందు ఉంటాం. బీఆర్ఎస్ పార్టీ మీకు కోర్టు ద్వారా న్యాయం చేపిస్తుంది.

# సంవత్సరం వయస్సులో చేరదీసి.... చదివించి... వివాహం చేస్తున్న సెయింట్ అల్ఫోన్సా కరుణాలయం

**అక్టోబర్ 2న సాయంత్రం 7 గంటలకు బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ సెయింట్ అల్ఫోన్సా కరుణాలయంలో పెళ్లి**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్29(నమస్తే ఉదయం):** అది 2002 సంవత్సరం.... సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో సంవత్సరం వయసున్న కుమార్తె తో ఓ తల్లి కనిపించింది. ఆమె వద్దకు రైల్వే సిబ్బంది వెళ్లి వివరాలు సేకరించగా మాది ఒడిస్సా అని చెప్పింది. ఎవరు లేరని చెప్పింది. దీంతో రైల్వే సిబ్బంది సెయింట్ అల్ఫోన్సా కరుణాలయంకు సమాచారం అందించి తల్లి, బిడ్డలను ఆ ఆశ్రమంలో చేర్పించారు. తల్లి పేరు సమర్పిత కాగా ఆ బాలిక కు క్రిస్టినా అని నామకరణం చేశారు. క్రిస్టినాను షామీర్‌పేట్ అలియాబాద్‌లోని ఆశ్రమలో చేర్పించి చదువు చెప్పించారు. ఆ తర్వాత కేరళ పంపించి ఇంటర్ వరకు చదివించారు.



**అక్టోబర్ 2న వివాహం. :**

తమ కరుణాలయం లో పెంచి పెద్ద చేసిన క్రిస్టినా కు అక్టోబర్ 2వ తేదీన షామీర్ పేట్‌కు చెందిన బొమ్మ వికాస్‌తో వివాహం జరిపిస్తున్నారు. అందుకు బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీలోని సెయింట్ అల్ఫోన్సా కరుణాలయం ఫాదర్ రెవరెండ్ థామస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. క్రిస్టినా తల్లి సమర్పిత ప్రస్తుతం ఈ కరుణాలయం లోనే ఆశ్రయం పొందుతోంది.

# నేడు మాజీ మంత్రులు కేటీఆర్, సబితా రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

**సీనియర్ బి ఆర్ ఎస్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి**

**బిఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలి**

**హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కొలుస్తున్న ప్రభుత్వం**

**మూసి బఫర్ జోన్‌లో నిర్మించిన ఇండ్లకు మార్కేసిన ప్రాంతాన్ని పరిశీలించనున్న మాజీ మంత్రులు**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయకపోవడంతో పాటు ప్రజలను మరోసారి మోసం చేయటానికి హైడ్రా పేరుతో పేదలను భయభ్రాంతులకు గురిచేతోందని రాజేంద్రనగర్ సర్కిల్ భారత్ రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గల మూసి బఫర్‌జోన్ ప్రాంతాలలో హైడ్రా అధికారులు మార్క్ చేసిన ఇండ్లను మాజీ మంత్రులు కేటీఆర్, సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, యువనేత కార్తీక్ రెడ్డి లు సోమవారం పరిశీలించనున్నారని ఆయన పేర్కొన్నారు. సర్కిల్ భారత్ రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



# ప్రజలారా... మీ ఆయుధం మేమవుతాం

(మొదటి పేజీ తరువాయి)

హైడ్రా దాడులు, కాంగ్రెస్ 6 గ్యారంటీల అమలు, బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిన మోసాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

బండి సంజయ్‌ఏమన్నారంటే.... ఈరోజు ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రతి ఒక్కరూ వీక్షించాలి. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నా. తెలంగాణలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా, ఏ వ్యక్తిని కదిలించినా హైడ్రా దాడులపైనే చర్చ జరుగుతోంది. హైడ్రా దాడులను చూసి బాధపడనోడు పాపాత్ముడు. మరి ప్రభుత్వం ఎందుకు పున: సమీక్షించుకోవడం లేదో అర్ధం కావడం లేదు. పైగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రచారం చేయిస్తున్నారు. సర్కార్ తీరు డామిట్ కథ అడ్డం తిరిగినట్లుగా ఉంది. పెద్దలు ఆక్రమించిన భవనాలను కూలగొడతారని మేం మొదట భావించాం. కానీ పేదల ఇండ్లు కూలుస్తున్నారు. పేద ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుని గృహ ప్రవేశం చేస్తే... ఆ ఇంటి తోరణాలు వాడకముందే వచ్చి కూల్చేస్తున్నారు. అన్ని అనుమతులు తీసుకుని, బ్యాంకు రుణాలు తీసుకుని ఇండ్లు కట్టుకుంటే.. వాటిని కూల్చడం ఎంత వరకు న్యాయం? వాళ్లంతా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుని బతుకుతున్న కుటుంబాలు.

ఆ ఇండ్లపై దాడులు చేస్తే వాళ్లకు దిక్కెవరు? వాళ్లు ఎట్లా బతకాలి? కాంగ్రెస్ తీరువల్ల హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతిన్నది. తెలంగాణలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నది. దీనిపై ఆలోచించకుండా ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడం సరికాదు. బీజేపీ పూర్తిగా ఈ విధానాన్ని వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ దాడులకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తున్నాం. పేదలకు ఆయుధంగా బీజేపీ మారబోతోంది. ప్రభుత్వం దిగొచ్చేదాకా పోరాడుతుంది.

పేద ప్రజాలరా.... మీకు అండగా బీజేపీ ఉంది. పేదలకు ఆయుధంగా బీజేపీ మారబోతోంది. మీ ఇండ్లపై బుల్డోజర్లు దిగాలంటే... ముందు బీజేపీ కార్యకర్తలపైన, మాపైన బుల్డోజర్లపై దిగిన తరువాత మీ ఇండ్లను తాకాలి. అందుకు పూర్తిగా సన్నద్ధమై ఉన్నం. ప్రభుత్వం కూడా పేదల ఇండ్ల కూల్చే ముందు దానికి సిద్ధం కండి.

సిగ్గుండాలే.. పేదల ఇండ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా? పేదల ఉసురు తీసుకోవడమే ఇందిరమ్మ రాజ్యమా? 6 గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేయడమే ఇందిరమ్మ రాజ్యమా?..పేదలు కన్నీళ్లు పెడుతుంటే మీకు కన్పించడం లేదా? బీఆర్ఎస్ కు, మీకు తేడా ఏముంది? గతంలో బీఆర్ఎస్ కూడా ఇట్లనే చేసింది. మీరు అదే పంథా కొనసాగుతున్నరు. మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా బీఆర్ఎస్ మోసం చేసింది.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా వాళ్లను మోసం చేస్తూనే ఉంది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ మోసం చేసింది... కాంగ్రెస్ సైతం 6 గ్యారంటీల అమలు పేరుతో ఓట్లు దండుకుని ప్రజలను నిండా మోసం చేసింది.

పేదల స్థల్లాల్లోనే కలెక్టరేట్లు, ఫైర్ స్టేషన్ల నిర్మాణం పేరుతో పేదల స్థలాలను బీఆర్ఎస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చేస్తోంది. అందుకే పేదలకు అండగా ఉండటానికి, ప్రజల ఆస్తులు కాపాడటానికి బీజేపీ తెగించి కొట్లాడేందుకు సిద్ధమైంది. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే ప్రణాళిక రూపొందించి అమలు చేయబోతున్నాం.

# అభివృద్ధి, స్వేచ్ఛకు ప్రభుత్వ ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించడం, వారి ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు చేపట్టడం.. వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడడమే ప్రభుత్వ ఉద్దేశం. మూసీ నది పరివాహక ప్రాంతంలో కుటుంబాలు ఆరోగ్యంగా జీవించేందుకు ఆ నదిని తీర్చిదిద్దాలనేది ప్రభుత్వం ఆలోచన. కలుషితమైన మూసీ నదిలో జీవించడం ఎవరికి కూడా మంచిది కాదు అన్నారు.

రాష్ట్రంలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం విని యోగిస్తాం, రాష్ట్రంలో విద్య, వైద్యం, సేవా రంగాలను తీర్చిదిద్దు తామని, రాష్ట్రసమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటు, సింగరేణి సిఎండి బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గగన్ పహాడ్‌లో సమస్యలతో

# కొట్టుమిట్టాడుతున్న ప్రజలు

**- బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వినయ్ కుమార్ రెడ్డి**

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు**

**బస్తీలలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ యువ మోర్చా కన్వీనర్ సూర్ రెడ్డి వినయ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం గగన్ పహాడ్ లో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయని అయితే జిహెచ్ఎంసి అధికారులు మాత్రం డ్రైనేజీ, రోడ్లు అందుకు అనుగుణంగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినయ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గగనపహాడ్ లో ఉన్న డ్రీమ్ ఇండియా, డ్రీమ్ అవెన్యూ కాలనీ కొత్త రోడ్ వేశారు కానీ గగనపహాడ్ గ్రామంలో రోడ్లు గత పది సంవత్సరాలుగా గుంతల మయంగా మారి పాడైన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవటం లేదని తీవ్రంగా మండిపడ్డారు. గుంతలు పడిన రోడ్లకు కనీసం జిహెచ్ఎంసి అధికారులు బ్యాచ్ వర్క్ చేసి మరమ్మతల్లి కూడా చేపట్టడం లేదని జిహెచ్ఎంసి అధికారులు ప్రజల నుండి టాక్స్ వసూలు చేయటానికి చూపుతున్న శ్రద్ధ ప్రజా సమస్యల పట్ల చూపటం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో గగన్ పహాడ్ సమస్యను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని వినయ్ కుమార్ రెడ్డి కోరారు.




సుమారు కోటి రూపాయలతో కొత్తగా ఏర్పడిన డ్రీమ్ ఇండియా వద్ద వేయడానికి శిలాఫలకం ఏర్పాటు చేసిన అధికారులు



గగన్ పహాడ్‌లో గుంతల మయంగా మారిన రోడ్లు

# భగవద్గీతతో సన్మార్గం, జ్ఞానం....

**ఇస్కాన్ టెంపుల్ బృందం వెంకటపతి వాసుదేవ దాస్, కేశవి దేవి దాసి**

**చిలుకూరులో హరే రామ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే నామముతో భగవద్గీత ప్రచారం**

**మొయినాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే ఉదయం):** ప్రజలు సన్మార్గంలో నడిచేందుకు భక్తి భావం కలిగి ఉన్నప్పుడే క్రమశిక్షణతో విజ్ఞానంతో ఆరోగ్యంగా జీవించగలుగుతారని ఇస్కాన్ టెంపుల్ బృందం వెంకటపతి వాసుదేవ్ దాస్ కేసవి దేవి దాసి లు పేర్కొన్నారు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో ఇస్కాన్ బృందంతో చిలుకూరులో శని వారము భగవాన్ నామ స్మరణ కీర్తనలు భగవద్గీత ప్రవచనాలు సంకీర్తనలు ప్రచారాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ బృందం వెంకటపతి వాసుదేవ దాస్ కేశవి దేవి దాసిలు మాట్లాడుతూ ప్రజలు భక్తి భావం కలిగి ఉన్నప్పుడే ఆరోగ్యంగా క్రమశిక్షణతో ఉంటారని సూచించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో మంచి ఆలోచనతో క్రమశిక్షణతో విజ్ఞానంతో మంచి మార్గంలో పయనిస్తారని సూచించారు భక్తి భావం కలిగిన ప్రతి ఒక్క వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు అదేవిధంగా ఆరోగ్యంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా వెళ్తారని తెలిపారు.



చిలుకూరి గ్రామంలో గల్లి గల్లి లో ఆటపాటలతో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు భగవన్నామ స్మరణ కీర్తనలు భగవద్గీత ప్రవచనములు సంకీర్తనలు ప్రచారం చేసారు ప్రతి శనివారము చిలుకూరి గ్రామంలో భగవద్గీత ప్రవచనాలు సంకీర్తనలు బోధిస్తామని తెలియజేసారు.

ఈ అవకాశమును గ్రామ ప్రజలందరు వినయోగించుకొని భగవంతుడు తెలిపిన మార్గములో నడుచుకొని మంచి సమాజమునకు తొడపడాలి అని కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత పుస్తకములను భక్తులకు పంపిణీ చేశారు అదేవిధంగా ఇస్కాన్ టెంపుల్ నుంచి తెచ్చిన ప్రసాదములను అందజేశారు ఈ కార్యక్రమంలో , చిలుకూరు గ్రామస్తులు పెద్ద చిన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ సౌత్ జోన్ బాక్సింగ్ పోటీలలో రాజేంద్రనగర్ భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమం విద్యార్థుల ప్రతిభ

**జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన కౌసర్ ఫాతిమ**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్29(నమస్తే ఉదయం):** సీబీఎస్ఈ సౌత్ జోన్ బాక్సింగ్ పోటీలలో రాజేంద్ర నగర్ భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 18, 19, 20 తేదీలలో తమిళనాడు చెంగల్ పట్టులోని శ్రీ గోకులం పబ్లిక్ స్కూల్‌లో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో రాజేంద్రనగర్‌లోని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమ్‌కు చెందిన కౌసర్ ఫాతిమ అండర్ 17 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి సీబీఎస్ఈ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించింది.

అండర్ 17 విభాగం బాక్సింగ్‌లో పాల్గొన్న చుప్పీతా యాదవ్ బ్రాంజ్ మెడల్ గెలుచు కోగా, లక్ష్మీనరసింహ అండర్ 14 విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. అక్టోబర్ 17 నుంచి 20వ తేదీ వరకు హర్యానా మహేందర్ఘర్ లోని ఎస్డీ సీనియర్ సెకండరీ స్కూల్ లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో కౌసర్ ఫాతిమ పాల్గొననున్నారు. వీరిని భారతీయ విద్యా భవన్ విద్యాశ్రం యాజమాన్యం, ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవి కిరణ్, ఫిజికల్ డైరెక్టర్ బి మురళీకృష్ణ, ఎన్. సంతోష్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యా యులు అభినందించారు. ఫాతిమా తల్లిదండ్రులు తమ కుమార్తె సిబిఎస్ఈ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



బాక్సింగ్ లో పథకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న భారతీయ విద్యాభవన్ విద్యాశ్రం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి కిరణ్

# రైతులను అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకే రైతు దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రుణమాఫీ మొదలుపెట్టారు.

బ్యాంకులు 73 లక్షల రైతులని చెప్తే.. రేవంత్ రెడ్డి 65 లక్షలని, చివరికి 48 లక్షల మంది రైతులకు రూ.34 వేల కోట్లు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామన్నారు.రకరకాల నిబంధనలతో దాన్ని తగ్గించే ప్రయత్నం చేయబోతే రైతుల ఆగ్రహానికి తోక ముడిచి అందరికీ ఇస్తామని హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి కార్యాలయం నుండి రాష్ట్రంలో 17వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని ఒక ప్రకటన చేశారు. కానీ, ఇప్పటివరకు ఎంత రుణమాఫీ అయిందనేది అధికారుల దగ్గర కూడా లెక్కలేదు. రుణమాఫీ జరగలేదని మేడ్చల్ ఎంపీడీవో ఆఫీసులో ఒక రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

రేవంత్ రెడ్డి మోసపు మాటలకు మారు పేరుగా నిలిచారు. అబద్ధాలే ఆయన జీవితం కాబట్టి మేమంతా ఐక్యమై సర్కారు మెడలు వంచే ఆందోళన చేస్తేనే రుణమాఫీ అవుతుందని రేపు ఇందిరాపార్క్ దగ్గర చేస్తున్న దీక్ష చేపడుతున్నాం. రైతులు పెద్దఎత్తున పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

రేపు ఉదయం 11 గంటలకు మొదలై ఎల్లుండి ఉదయం 11 గంటల వరకు 24 గంటల పాటు ఈ రైతు దీక్ష జరగబోతుంది. రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము.

రైతన్నలకు నష్టం చేస్తే మంచిది కాదనే సోయి రేవంత్ రెడ్డికి లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రేవంత్ రెడ్డి మాటలు చూస్తే ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా కనిపించడం లేదు. ప్రభుత్వం మెడలు వంచడానికి మీ పక్షాన మేము చేస్తున్న దీక్షకు తరలిరావాలని రైతన్నలకు పిలుపు నిస్తున్నాం.

ఘట్‌కేసర్‌లో 1,206 మంది రుణం తీసుకుంటే ఇంకా 1,006 మందికి రుణమాఫీ కాలేదు. పూడూరు సొసైటీలో కూడా రుణమాఫీ కాలేదు. రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే ఈ దీక్ష చేస్తున్నాం. రైతులకు భరోసా కల్పించేందుకు భారతీయ జనతా పార్టీ ప్రజాప్రతినిధులందరం ఇందిరాపార్క్ దగ్గర రేపు దీక్ష చేస్తున్నాము. రేపు జరగబోయే దీక్షలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం.

## టిజిఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ బుక్కింగ్ కౌంటర్లు
# సద్వినియోగం చేసుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):** టిజిఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ గద్వాల డిపో ద్వారా మీకు ప్రతి పట్టణం నుండి మండలం వరకు అత్యవసర సరకు రవాణ కొరకై మేము మీ అవసరాలకు అనుగుణంగా బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు లాజిస్టిక్స్ ఏటీఎం ఇసాక్ బిన్ మహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కింగ్ సెంటర్ల వారి పోన్ నంబర్లు గద్వాల-9885545321, మల్దకల్-9391521450, ఐజ-9395511566, శాంతినగర్-9154522345, రాజోలి-8121676791, అల్లంపూర్ ఎక్స్ రోడ్-8885224526, కర్నూలు-7675933131, నంద్యాల-9866622628, ఎమ్మిగనూరు-9494385305, ఆదోని-9618894304 .కావున ఇట్టి విషయాన్ని గమనించి మీ యొక్క సరుకును టిజిఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా బుకింగ్ చేయించుకొని తెలంగాణ,ఆంధ్ర, మహారాష్ట్ర మరియు కర్ణాటక రాష్ట్రాలలో మా యొక్క సేవలను పొందగలరని పేర్కొన్నారు.

## గిరిజన కుటుంబాన్ని పరామర్శించిన
# మాజీ సర్పంచ్ చిటికెల వెంకటయ్య

**శంషాబాద్,సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):**
శంషాబాద్ మండలంలోని పెద్దతుప్రా అనుబంధ గ్రామమైన రషీద్ తండాకు చెందిన కేతవత్ చిన్న తుల్చయ ఆదివారం మృతి చెందాడు. చిన్న తుల్జా మృతదేహానికి స్థానిక మాజీ సర్పంచ్ శంషాబాద్



మండలం బిజెపి అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు, లక్ష్మణ్, గోవింద్, భిక్య,అరవింద్,సేవ్య,శ్రీను, తేజ్య,పరామర్శించారు.

# రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలి

**- బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కారుకొండ ప్రదీప్**



**శంషాబాద్, సెప్టెంబర్ 29( నమస్తే ఉదయం):** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ వెంటనే రేషన్ కార్డులు అందజేయాలని రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి కారుకొండ ప్రదీప్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డులు అందజేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రాజకీయాలకే పరిమితమయ్యారని దీనితో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విజయదశమి నాటికి ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయాలని లేదంటే బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాల ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. గతంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం రాజకీయాలకే పరిమితం అయ్యాయని ఆరోపించారు. 11 ఏళ్లుగా ఒక రేషన్ కార్డు కూడా మంజూరు చేయకపోవడం పేద ప్రజలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రేషన్ కార్డుల కోసం నిరుపేద ప్రజలు కళ్ళల్లో ఒత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారని వారికి రేషన్ కార్డులు అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని సూచించారు. రేషన్ కార్డులు లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు ఉచిత బియ్యం పథకానికి ప్రజలు నోచుకోలేకపోతున్నారని స్పష్టం చేశారు.

# ఆత్మరక్షణకు కరాటే దోహదం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):**



ప్రతీ ఒక్కరి ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగ పడుతుందని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరి అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టుల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆదివారం ఎల్లో, ఎల్లో ఒన్, గ్రీన్, బ్లూ, రెడ్ బెల్టులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ శ్రీనివాసులు, రామేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అవోపా జిల్లా అధ్యక్షునిగా మరిడి శ్రీకాంత్

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):** ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గద్వాల జిల్లా అధ్యక్షుడిగా మరిడి శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి వసతి గృహం నందు ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర నాయకులు పోల శ్రీధర్, కందికొండ శ్రీనివాస్, కలకొండ సూర్యనారాయణ కండే కుమారస్వామి, ఆముదాల నరసింహస్వామి, చిలుకురి.శివశంకర్, బాలక్రిష్ణ నూతన కార్యవర్గ ఎంపికను పర్యవేక్షించారు. జోగులాంబ గద్వాల జిల్లా అవోపా జిల్లా అధ్యక్షుడిగా మరిడి శ్రీకాంత్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ...అనేక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను గతంలో అనేక నిర్వహించామని, మళ్లీ అదే పద్ధతిలో పనిచేస్తామన్నారు. నూతన జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ ను ఆర్యవైశ్య సంఘం నాయకులు, పూలమాలతో సన్మానించారు.




శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

# జిల్లా పుట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా బండల వెంకట రాములు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):**
గద్వాల్ పట్టణంలోని కేఎస్ ఫంక్షన్ హాల్ ఆదివారం గద్వాల్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా, రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులుగా బండల వెంకట్రాములు,

ప్రధాన కార్యదర్శిగా వి.విజయ్ కుమార్, కోశాధికారిగా పి.త్యాగరాజు, ఉపాధ్యక్షులుగా ఎండీ.బషీర్, కె.వెంకట్రాములు (రోషి), ఎల్ విష్ణు, పి.నవీన్, పి. తిరుమలేష్, జగన్, అసిస్టెంట్ సెక్రటరీలుగా కె.శివ నాగరాజు, ఎం. నగేష్, కె మధు, జాయింట్ సెక్రటరీలుగా వి.శ్రీనివాస రెడ్డి, టి. వెంకటేష్ (మండేలా), పి.ప్రశాంత్ గౌడ్, రాజారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆనంద్ కుమార్, కె. చక్రధర్, ఝూడే శ్రీను. లీగల్ అడ్వైజర్ లుగా పూజారి శ్రీధర్, బండల పాండు, కార్యవర్గ సభ్యులుగా నల్లన్న(పోలీస్), హాలిమ్, పి. చిన్న, ఎం. కిరణ్, టి.రాజసింహ, టి.శ్రీను( హెూంగార్డు), రామకృష్, రాబిన్, విజయ్, క్రిష్ణ, వెంకటేష్ (భద్ర), జయరాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఫాల్గుణ మాట్లాడుతూ ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు వచ్చేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో



ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అద్భుతమైన వసతులు ఉన్నాయని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకుని ముందుకు వెళ్లాలని, అన్ని విధాలుగా మీకు అండగా ఉంటానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో గద్వాలకు వన్నెతెచ్చేలా సీనియర్ క్రీడా కారులు కృషి చేయాలని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి తో రాణించాలని, క్రీడాకారుల ఎదుగుదలకు జిల్లా అసోసియేషన్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవై ఎస్ఓ బిఎస్. ఆనంద్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ పి. జితేందర్, సీనియర్ క్రీడాకారులు ఎస్ వి. నారాయణ, త్యాగరాజు, బషీర్, విష్ణు తదితరులు ఉన్నారు.

## గుండెపోటుపై ప్రతి ఒక్కరికి
# సిపిఆర్ అవగాహన ఉండాలి:చిన్న జీయర్ స్వామి

**మూడు వేల మందికి అవగాహన కల్పిస్తాం: గుండె వైద్య నిపుణులు డాక్టర్ హనుమంత రెడ్డి**

**శంషాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):**
గుండెపోటుతో ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని గుండెపోటు వచ్చిన వారికి తక్షణం అందించే సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉన్నదని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి సహకారంతో శంషా






కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న చిన్న జీయర్ స్వామి, సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బాద్ మండలం శంకరపురం గ్రామానికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మల్ రెడ్డి హనుమంత రెడ్డి. చర్మ వైద్యాన్నిపుణులు డాక్టర్ మిథిని రెడ్డి సంయుక్తంగా శ్రీరామ నగరంలోని చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ... మారిన పరిస్థితుల కారణంగా ప్రతి ఒక్కరు ఏదో ఒక అనారోగ్యానికి గురవుతున్నారని అయితే రోగం వల్ల వచ్చే వ్యాధి కన్నా ఫలానా వ్యాధి సోకిందని తెలిస్తేనే ప్రజలు అధికంగా భయపడుతున్నారని అన్నారు. గుండెపోటు అనేది చాలా ప్రమాదకరమైనదని ఈ జబ్బు వచ్చిన వెంటనే ప్రథమ చికిత్స చేయడం కోసం సిపిఆర్ విధానం ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. గుండెపోటు వచ్చిన వెంటనే గుర్తించి వైద్యులు సూచించిన విధంగా సిపిఆర్ చేస్తే మనిషి బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనిసూచించారు. లావా పేక్ష లేకుండా సిపిఆర్ విధానం పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దంపతులు మితిని రెడ్డి. హనుమంత రెడ్డి లను ఆయన అభినందించారు. సిపిఆర్ వైద్య విధానం పై అవగాహన ఉంటే అనేకమంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని చిన్న జీయర్ స్వామి సూచించారు.

తాను శంషాబాద్ మండలంలో జన్మించినందున గుండెపోటుతో ఈ ప్రాంత ప్రజలకు రక్షణ కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ హనుమంత రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉద్యోగులు, వైద్య సిబ్బందికి అవగాహన ఉంటే తమ పరిసరాల్లో గుండెపోటు సంఘటనలు జరిగితే వెంటనే ప్రథమ చికిత్స చేసే అవకాశం ఉంటుందని హనుమంత రెడ్డి సూచించారు.

ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన దాదాపు మూడు వేల మందికి సి పి ఆర్ విధానం పై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో త్రిదండి అహోబిల స్వామి. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్. డాక్టర్ మనోజ్ కుమార్ . డాక్టర్ అబ్దుల్ ఖాదర్. డాక్టర్ పార్థసారథి. స్థానిక మాజీ సర్పంచ్ వడ్డే సుజాత చంద్రయ్య. కారుకొండ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.





వృత్తిలో మంచి సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం: ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29(నమస్తే ఉదయం):** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టిఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సన్మాన మహెూత్సవానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, సరస్వతి దేవి చిత్రపటాలకు పూజా కార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వాలన చేశారు. అనంతరం ప్రవేట్ స్కూల్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.... ముందుగా ప్రైవేటు స్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వారికి హార్దిక శుభాకాంక్షలు. ఒక ప్రాంత అభివృద్ధికైనా, దేశం అభివృద్ధికైనా, దేశ నాగరికతకు ఒక చిహ్నంగా చూడాలంటే విద్య అనేది ఒక కొలమానంగా ఉంటుందన్నారు. విద్య అనేది ఒక ఉద్యోగానికో, వృత్తి కోసమే అనేది కాదు, ఉన్నతమైనటువంటి విలువలతో సమసమాజ స్థాపన కోసం హక్కుల పరిరక్షణ కోసం ఒక గౌరవప్రదమైన విలువలతో కూడినటువంటి దన్నారు. సమాజాన్ని, ప్రపంచాన్ని అర్థం చేసుకోగలిగే శక్తి విద్య ద్వారా మనిషి పొందగలుగుతారన్నారు. ఇవాళ గొప్ప గొప్ప చదువులు చదివిన వారు కూడా వ్యాపారం, వ్యవసాయం, వారి తల్లిదండ్రుల వ్యాపారాలను కంటిన్యూ చేస్తున్నారన్నారు. ఏ పని చేయాలన్నా, సమాజంలో గౌరవంగా బతకాలన్నా దానికి విద్య తప్పనిసరి అని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చిన్న చూపు చూడడం సరైంది కాదని, వారు కూడా ఎంతో చక్కగా చదువుకొని విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూళ్ల పైన కొంతమంది అపనిందలు వేయడం మానుకోవాలని సూచించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా అసోసియేషన్ కృషి చేయాలని కోరారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్లో పైదాడిని ఖండిస్తూ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం, టీచర్స్, డ్రైవర్లు, ఏకతాటిపై నిరసన రావడం అభినందనీయమన్నారు. తాటిగా కలిసిమెలిసి ఉన్నారు.

ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాబునాయుడు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో ప్రభుత్వ, స్కూల్ ప్రైవేటు పాఠశాలలు రెండు రెండు కళ్లు లాంటివని అన్నారు. ప్రైవేటు స్కూల్లో ప్రస్తుతం టెక్నాలజీ పరంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వ, ప్రవేట్ విద్యాసంస్థలు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యా బోధనను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబు నాయుడు, గౌరవ అధ్యక్షుడు బీచుపల్లి, కార్యవర్గ సభ్యులు, ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# చిన్నారి గుండెలకు సుప్రీమ్ హీరో సాయి ధరమ్‌తేజ్ భరోసా

మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్. చిన్నారి గుండెలకు తన వంతు భరోసా కల్పించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' హైదరాబాద్ బంజారాహిల్స్ రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు సాయి దుర్గ తేజ్. చిన్నారుల్లో హృదయ సంబంధ సమస్యలకు చికిత్స అందించేందుకు 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' చేస్తున్న ప్రయత్నాన్ని సాయి ధరమ్ తేజ్ అభినందించారు. ఈ సంస్థకు తన వంతుగా 5 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. మనమంతా కలిసి పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తును సృష్టిద్దామంటూ పిలుపునిచ్చారు సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్. ఆయన మంచి మనసును రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు, ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రశంసించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే సాయి దుర్గతేజ్.. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడిన తెలుగు ప్రజలను ఆదుకునేందుకు తన వంతుగా 20 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు.

క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రాజ్యశ్యామల ఎంటర్టైన్మెంట్స్ & హౌస్ ఫుల్ మూవీస్ బ్యానర్ పై గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం రంగమార్తాండ. విమర్శకుల ప్రసంశలు పొందిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, బ్రహ్మానందం పోటీపడి నటించారు. దర్శకుడు కృష్ణవంశీ ఈ సినిమాను తీర్చి దిద్దిన తీరు అద్భుతం. ఇళయరాజా సంగీతం, సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యం ఇలా సినిమాకు ప్రతీది ఒక హైలెట్ గా నిలిచాయి. ముఖ్యంగా బ్రహ్మానందం, ప్రకాష్ రాజ్ హాస్పిటల్ ఎపిసోడ్ సినిమా చూసిన పతి ఒక్కరిని కంటతడి పెట్టించాయి. అలా చక్రపాణి, రాఘవరావు పాత్రలు కొంతకాలం ప్రేక్షకుల మనసులో చారగని ముద్ర వేసుకున్నాయి. తాజాగా దుబాయ్‌లో జరిగిన ఐఫా అవార్డ్స్ కార్యక్రమంలో లెజండరీ నటుడు బ్రహ్మానందం కు ఉత్తమ సపోర్టింగ్ కేటగిరీలో అవార్డ్ రావడం విశేషం.

ఈ అవార్డ్ ను మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా బ్రహ్మానందం అందుకున్నారు. "ఈ అవార్డ్ రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని, ఈ క్రెడిట్ మొత్తం డైరెక్టర్ కృష్ణవంశీకి చెందుతుందని తెలిపారు.



# 'మా' సభ్యులందరికీ ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్



మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులందరికీ కూడా ఫ్రీ మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. 'మా' ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ విష్ణు మంచు, వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి ఈ హెల్త్ క్యాంప్‌ను జీవీకే హెల్త్ హబ్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ ఫ్రీ హెల్త్ చెకప్‌లో 'మా' సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మీడియాతో

విష్ణు మంచు మాట్లాడుతూ.. 'డా.శాస్త్రి గారికి, జీవీకే హెల్త్ హబ్‌కు థాంక్స్. 'మా' సభ్యులందరికీ ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి హెల్త్ క్యాంప్ ప్రారంభమైంది. వేల ఖర్చుతో కూడుకున్న ఈ హెల్త్ చెకప్‌ను ఫ్రీగా అందిస్తున్నందుకు థాంక్స్. ఇది ఇకపై ఇలా కొనసాగాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

మాదాల రవి మాట్లాడుతూ.. 'జీవీకే హెల్త్ హబ్‌తో కలిసి మాస్టర్ హెల్త్ చెకప్‌ను గ్రాండ్‌గా నిర్వహిస్తున్నాం. 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు మా సభ్యుల ఆరోగ్యానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇది మా ఆధ్వర్యంలో నాలుగో హెల్త్ క్యాంప్. మా సభ్యుల ఆరోగ్యం, సంక్షేమం కోసం హెల్త్ కార్డ్‌లను జారీ చేశాం. వాటిని అందరూ వినియోగించుకోవాలి. దేశంలో అత్యవసర సేవల విషయంలో జీవీకే సంస్థ చేస్తున్న కృషి అందరికీ తెలిసిందే. మా సభ్యుల కోసం ఇలా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసేందుకు సాయం చేసిన జీవీకే రెడ్డి గారికి థాంక్స్' అని అన్నారు.

## "స్వాగ్"లో మహారాణి రుక్మిణీదేవిగా

# రీతు వర్మ

అందం, ప్రతిభ గల అతి తక్కువ మంది తెలుగు హీరోయిన్స్ లో ఒకరు రీతు వర్మ. పెళ్లి చూపులు, టక్ జగదీశ్, వరుడు కావలెను, కనులు కనులను దోచాయంటే వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది రీతు వర్మ. ఫిలింమేకర్స్ లో ప్రామిసింగ్ యంగ్ యాక్ట్రెస్ గా పేరు సంపాదించుకుంది. తెలుగుతో పాటు తమిళంలోనూ పలు క్రేజీ ప్రాజెక్ట్స్ చేస్తోంది రీతు వర్మ. ఆమె అప్ కమింగ్ రిలీజ్ స్వాగ్ తో మరోసారి ప్రేక్షకుల్ని అలరించబోతోంది. స్వాగ్ సినిమాలో వింజామర వంశ మహారాణి రుక్మిణీ దేవి పాత్రలో రీతు వర్మ కనిపించనుంది. మహారాణి రుక్మిణీదేవి పాత్రతో ఆమె అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. స్వాగ్ లో రీతు వర్మ క్యారెక్టర్ హైలైట్ కానుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేసేందుకు ఇష్టపడే రీతు వర్మ..మహారాణి రుక్మిణీదేవి పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధమైంది. ఆమె ఎఫర్ట్ స్క్రీన్ మీద కనిపించబోతోంది. ప్రస్తుతం రీతు వర్మ తెలుగుతో పాటు తమిళంలోనూ పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ చేస్తోంది.



# 'జిగ్రా'ని తెలుగులో విడుదల చేస్తున్న రానా దగ్గుబాటి

సినిమాకు భాషతో, హద్దులతో సంబంధం లేదు. అందుకు ఉదాహరణగా నిలుస్తోంది 'జిగ్రా' మూవీ. ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రంపై బాలీవుడ్‌లో మంచి అంచనాలున్నాయి. ఇప్పుడు ఈ అంచనాలు దక్షిణాదికి వ్యాపించనున్నాయి. మంచి సినిమాలకు తన వంతు ఆదరణను ఎప్పుడూ తెలియజేసే హీరో రానా దగ్గుబాటి ఈ సినిమాను తెలుగులో విడుదల చేయటానికి సిద్ధమయ్యారు. 'జిగ్రా' చిత్రాన్ని తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా హిందీ ట్రైలర్ విడుదలై అంచనాలను పెంచిన సంగతి తెలిసిందే. కాగా జిగ్రా తెలుగు ట్రైలర్‌ను గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా... రానా దగ్గుబాటి మాట్లాడుతూ "జిగ్రా కథలో మంచి సోల్ ఉంది. భాషతో సంబంధం లేకుండా ఎవరికైనా ఇది కనెక్ట్ అవుతుంది. ఇలాంటి వైవిధ్యమైన కథతో రూపొందిన ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలని భావించాం. అందుకనే ధర్మ ప్రొడక్షన్స్‌తో కలిసి నేను, ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నామని గర్వంగా తెలియజేస్తున్నాం. జిగ్రా అనేది కేవలం యాక్షన్ చిత్రం మాత్రమే కాదు.. మా కుటుంబంలోని అనుబంధాలను తెలియజేసే చిత్రం. మనం ఎంతగానో ప్రేమించే వ్యక్తులను మనం ఎలా కాపాడుకోవాలో తెలియజెప్పే సినిమా. ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం భాష, సరిహద్దులతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుందనటంలో సందేహం లేదు" అన్నారు.



# 'రహస్యం ఇదం జగత్' టీజర్



కొత్తదనంతో కూడిన చిత్రాలను, వైవిధ్యమైన కథలను మన తెలుగు ప్రేక్షకులు ఆదరించడానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. ఇక వాళ్లతో ఆసక్తిని కలిగించే సైన్స్ ఫిక్షన్ అండ్ మైథాలాజికల్ థ్రిల్లర్స్ అంటే.. అందునా మన పురాణాలు, ఇతిహాసాల గురించి ఏదైనా అంశంతో రూపొందిన చిత్రమంటే ఎంతో ఆసక్తితో చూస్తారు. సరిగ్గా అలాంటి జానర్‌లోనే రాబోతున్న చిత్రం రహస్యం ఇదం జగత్. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రం రహస్యం ఇదం జగత్. సింగిల్ సెల్ యూనివర్స్ ప్రొడక్షన్ పతాకంపై కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ అండ్ మైథాలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతుంది. నవంబరు 8న చిత్రం విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ డేట్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా ఈ చిత్రం టీజర్‌ను అమెరికాలోని డల్లాస్‌లో విడుదల చేశారు మేకర్స్. తొలిసారిగా ఓ తెలుగు చిత్రం అమెరికాలో టీజర్ విడుదల చేయడం ఇదే తొలిసారి. డల్లాస్‌లోని యూనివర్శిటి ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో జరిగింది. అక్కడ వున్న క్యాంపస్ మూవీ థియేటర్‌లో టీజర్ ఆవిష్కరణ జరిగింది. ఈ వేడుకలో యూనివర్శిటి స్టూడెంట్స్‌తో పాటు అమెరికాలోని సినీ ప్రేమికులు, తానా నాటా అసోసియేషన్ ప్రతినిధులతో పాటు ఇతర తెలుగు అసోసియేషన్ సభ్యులు కూడా హాజరయ్యారు. ఇప్పటి వరకు యూఎస్‌లో ఇలాంటి ఫంక్షన్ జరగడం ఇదే తొలిసారి కావడంతో భారీ ఎత్తున్న ఆడియన్స్ హాజరయ్యారు. ఇక టీజర్‌ను గమనిస్తే సైన్స్ ఫిక్షన్‌కు మైథాలాజికల్ అంశాలతో పాటు థ్రిల్లింగ్ అడ్వెంచెరస్‌ను ఇండియన్ హిస్టారికల్ అంశాలను వెలికితీసే టీమ్‌కు ఎదురైన పరిస్థితులతో ఈ చిత్రం రూపొందుతున్నట్లుగా అనిపిస్తుంది. టీజర్ చూస్తుంటే అందరిలో సినిమాపై మంచి బజ్, ఇంట్రెస్ట్ కలుగుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. తప్పకుండా ఇలాంటి విభిన్నమైన, కొత్త కాన్సెప్ట్ చిత్రాలనే నేడు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు అన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699.** Cell: 9492148733